సాక్షి
కాకినాడ
గురువారం । 22 । మే । 2025




లాభాల దుక్కు
వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన ఆధునిక విధానాలతో పాటు సంప్రదాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు.

8లో



సొమ్ము కొట్టు.. సర్టిఫికెట్ పట్టు
కాకినాడ జీజీహెచ్‌లో నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల దందా వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులే దీనికి పాల్పడ్డారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 7,793 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.65 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

అత్యధికంగా కరపలో 71.8 మిల్లీమీటర్ల వర్షపాతం

కాకినాడ సిటీ: జిల్లాలో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి బుధవారం 8 గంటల వరకు సరాసరిన 20.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కరప మండలంలో 71.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యల్పంగా ఏలేశ్వరం మండలంలో 5.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీ వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. పెదపూడి మండలంలో 38.2 మిల్లీమీటర్లు, శంఖవరం 30.2, జగ్గంపేట 29.2, తాళ్లరేవు 27, కాజులూరు 24.4, కాకినాడ అర్బన్ 22.4, పెద్దాపురం 18,6 గండేపల్లి 17.2, రౌతులపూడి 16.4, కిర్లంపూడి 15.4, తొండంగి 15.2, గొల్లప్రోలు 14.8, తుని 14.8, ప్రత్తిపాడు 14, కాకినాడ రూరల్ 14, పిఠాపురం 12, యు కొత్తపల్లి 11.8, కోటనందూరు 8.8, సామర్లకోట 8.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏపీ ఈఏపీ సెట్‌కు 95.83 శాతం హాజరు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఏపీఈఏపీ సెట్-25 ఆన్‌లైన్ పరీక్షలు బుధవారం మూడవ రోజు కాకినాడ జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు ఆన్‌లైన్ కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి నిర్వహించిన పరీక్షకు 1,719 మంది హాజరుకాగా 64 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 851 మంది హాజరుకాగా 37మంది, మధ్యాహ్నం పరీక్షకు 868మంది హాజరుకాగా 27మంది గైర్హాజరయ్యారని కన్వీనర్ వీ.వీ.సుబ్బారావు తెలిపారు.

పార్టీ తప్పిదం వల్లే కార్యకర్తల్లో అసహనం

– టీడీపీ కాకినాడ రూరల్ మినీ మహానాడులో జ్యోతుల నవీన్

కాకినాడ రూరల్: తెలుగుదేశం పార్టీ తప్పిదం వల్ల కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, ఎన్నికల ముందు నుంచి ఇన్‌చార్జిని ప్రకటించాలని కార్యకర్తలు మొర పెట్టుకుంటున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ వద్ద స్పందన ఫంక్షన్ హాలులో బుధవారం కాకినాడ రూరల్ నియోజకవర్గ టీడీపీ మినీ మహానాడును నిర్వహించారు. పరిశీలకుడిగా శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూరి సత్తిబాబు హాజరయ్యారు. పలువురు మాట్లాడుతూ కాకినాడ రూరల్‌లో జనసేన ఎమ్మెల్యేను నెగ్గించుకున్నామని, ఆయన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

భద్రతా వైఫల్యంతోనే ఉగ్రవాదుల చొరబాటు



అమలాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఏఐసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు రుద్రరాజు

అమలాపురం టౌన్: బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్, పారా మిలటరీ దళాలు, లోకల్ పోలీసులు, ఎల్‌ఓసీతో పాటు పలు రకాల కేంద్ర ప్రభుత్వ నిఘా ఏజెన్సీల నిరంతర పర్యవేక్షణ ఉన్నప్పుడు పహల్గామ్‌లోకి ఉగ్రవాదుల చొరబాటు భద్రతా వైఫల్యంతోనే జరిగిందని ఏఐసీసీ ఆహ్వాన కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రుద్రరాజు మాట్లాడారు. ఇంతటి భద్రతా వలయాలను దాటుకుని ఉగ్రవాదులు ఎలా వచ్చారు. ఎలా మట్టుపెట్టారు అనే దానిపై దేశ ప్రజలు ఆలోచించాలని ఆయన పేర్కొన్నారు. ఇన్ని కోణాల్లో భద్రతా వైఫల్యం వల్లే పహల్గామ్‌లో ఉగ్రవాదులు చొరబడి పర్యాటకులను పొట్టన పెట్టుకున్నారని అన్నారు. అందుకు కారణమైన కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పహల్గామ్‌లో పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత పరిణామాలపై కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి దేశ ప్రజలకు, ప్రతిపక్షాలకు వివరణ ఇవ్వాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి మోదీ గత 11 సంవత్సరాల్లో 176 దేశాల్లో పర్యటించి ఆయా దేశాలతో సత్ సంబంధాలు మెరుగుపరిచే ప్రయత్నం చేశారు. అయితే పహల్గామ్ ఘటన అనంతరం అనివార్యమైన యుద్ధ సమయంలో ఏ ఒక్క దేశం కూడా మన దేశానికి మద్దతు ఇచ్చేందుకు ముందుకు రాలేదంటే దేశ ప్రజలు ఆలోచించాలని రుద్రరాజు అన్నారు. సమావేశంలో ఏపీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, రాష్ట్ర అధికార ప్రతినిధి వంటిద్దు బాబి, ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర పాల్గొన్నారు.

బాబొచ్చారు.. కష్టాలు తెచ్చారు

- ఇంటింటికీ సరకుల పంపిణీకి మంగళం
- రేషన్ దుకాణాల వద్ద నిరీక్షణ తప్పదు
- రోడ్డున పడనున్న ఎండీయూ వాహనదారులు
- జగన్ పుణ్యాన ఐదేళ్లూ ఇంటి ముంగిటకే సరకులు



బియ్యం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్ (ఫైల్)



రేషన్ కోసం క్యూ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఇంటింటికీ రేషన్ పథకానికి కూటమి సర్కార్ మంగళం పాడేస్తోంది. నాడు చంద్రబాబు హయాంలో పడ్డ రేషన్ కష్టాలు మరో 10 రోజులలో తిరిగొచ్చేస్తున్నాయి. రేషన్ తీసుకోవడానికి చౌకధరల దుకాణాల వద్ద ప్రజలు పడుతున్న కష్టాలను పాదయాత్రలో స్వయంగా చూసి చలించిపోయిన జగన్‌మోహన్‌రెడ్డి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. దాదాపు ఐదేళ్ల పాటు ఇంటి ముంగిటకే అందించిన రేషన్ ఇక ఇంటికి రాదని తెలిసిన దగ్గర నుంచి కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చౌకధరల దుకాణాల డీలర్లు తమకు నచ్చిన సమయాల్లో రేషన్ సరకులు సరఫరా చేసే పరిస్థితుల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతోనే నాడు జగన్ కార్డుదారుల ఇంటి ముంగిటకే ఎండీయూ వాహనాలను తీసుకువచ్చారు. రేషన్‌కార్డుదారులకు సౌకర్యంతో పాటు ఎండీయూ వ్యవస్థ ద్వారా వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కూడా కల్పించారు. అటువంటి ఎండీయూ వ్యవస్థ ఒప్పంద కాలపరిమితి ఏడాదిన్నర ఉండగానే చంద్రబాబు సర్కార్ మంగళవారం కేబినెట్ భేటీలో తీసుకున్న రద్దు నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సర్కారు నిర్వాకాన్ని తప్పు పడుతున్న జనం

రేషన్‌కార్డు అంటేనే నిరుపేద, సామాన్య, మధ్యతరగతి వర్గాల కోసం ఉద్దేశించింది. అటువంటి వారి ఇళ్ల ముంగిటకు నేరుగా వెళ్లి రేషన్ సరకులను అందిస్తున్న మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)వాహనాలను రద్దు చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఒకప్పుడు రేషన్ తీసుకోవడానికి చౌకధరల దుకాణాల వద్ద క్యూ లలో గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులను చవి చూసిన జనం ఎండీయూ వాహనాలు వచ్చాక చాలా సంతోషంగా ఉన్నారు. గడచిన ఐదేళ్లుగా దినసరి కూలీలు, వ్యవసాయ కూలీలు, చిన్నా, చితకా పనులు చేసుకునే వారి దగ్గర నుంచి మధ్యతరగతి కుటుంబాలు ఇంటి ముంగిటకే రేషన్ సరకులు వచ్చేస్తుండటంతో సంబరపడ్డారు. రేషన్ దుకాణాల వద్ద నిరీక్షించడంతో సామాన్యుల జీవనోపాధి దెబ్బతింటుందనే ఉద్దేశంతో తీసుకువచ్చిన వ్యవస్థను లేకుండా చేస్తున్న కూటమి సర్కార్ నిర్వాకాన్ని ప్రజలు తూర్పార పడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి నెలా ఒకటి నుంచి 17 తేదీ వరకూ ఎండీయూ ఆపరేటర్లు కచ్చితంగా ఇంటికి వచ్చి రేషన్ ఇస్తారనే భరోసా కల్పించారు. ఇప్పుడు ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా గత ప్రభుత్వ పథకాలు ఉండకూడదనే కూటమి దుర్బుద్ధి బయట పడిందంటున్నారు. కాకినాడ జిల్లాలో 515 గ్రామ సచివాలయాల పరిధిలో 6.43 లక్షల రేషన్‌కార్డులు ఉంటే 1,060 రేషన్ దుకాణాలున్నాయి. ఈ కార్డుదారులకు ఇంతవరకు 428 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరకులు అందిస్తున్నారు. అటువంటి ఎండీయూ వ్యవస్థను ఇప్పుడు హఠాత్తుగా రద్దు చేస్తామనడమంటే ప్రజలకు తిరిగి కష్టాలు చూపించడమేనంటున్నారు.

గత ప్రభుత్వంలో ఒక్కొక్క వాహనానికి డ్రైవర్, ఆపరేటర్, హెల్పర్ పోస్టులను మంజూరు చేసి జిల్లాలో 1,284 మంది నిరుద్యోగులకు ఉపాధి చూపించారు. అలాగని రేషన్ డీలర్లను తొలగించకుండా వారి ఉపాధికి భంగం కలగకుండా నెల నెలా కమీషన్‌తో పాటు, గోనె సంచులను కూడా డీలర్లకే అప్పగించేవారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడమంటే వందలాది మంది ఆపరేటర్లను రోడ్డున పడేయడమే. ఎండీయూ వాహన వ్యవస్థను అమలులోకి తెచ్చినప్పుడు జిల్లాలో పౌరసరఫరాలశాఖ, బీసీ, ఎస్సీ కార్పొరేషన్‌లు, బ్యాంక్ ఆఫ్‌బరోడా, ఎండీయూ వాహనాల ఆపరేటర్‌ల మధ్య రాష్ట్ర ప్రభుత్వం కుదిర్చిన ఒప్పందం గడువు ఇంకా ఏడాదిన్నర ఉంది. ఒక ఎండీయూ ఆపరేటర్‌కు ఇచ్చే రూ.18వేలులో డీజిల్‌కు రూ.3,000, హెల్పర్‌కు రూ.5,000 పోతే మిగిలే రూ.10వేలతో ఆపరేటర్ కుటుంబం జీవనోపాధి పొందేది. వాహనాలకు ఒప్పంద గడువు ఉండగానే ఈ వ్యవస్థ రద్దు చేయడం ద్వారా ఇన్ని వందల కుటుంబాల ఉసురుపోసుకుంటోందని ప్రభుత్వంపై వారు నిప్పులు చెరుగుతున్నారు. నెలకు రూ.10వేల జీతం ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలోకి తొక్కి మొత్తం వలంటీరు వ్యవస్థనే రద్దు చేసిన కూటమి సర్కార్ ఇప్పుడు రద్దుల పద్దులో ఇంటింటికీ రేషన్ సరఫరా ఎండీయూ వాహనాలను చేర్చి వారిని రోడ్డున పడేస్తోంది.

రేషన్ కోసం పని మానుకోవాల్సి వస్తుంది



వచ్చే నెల నుంచి ఇంటింటికీ తీసుకొచ్చే రేషన్ బళ్లు రద్దు చేయడం మంచిది కాదు. చౌకధరల దుకాణానికి వెళ్లి గంటలకొద్దీ లైన్‌లో నిలబడాల్సి ఉంటుంది. సిగ్నల్స్ లేకపోతే ఒక్కోసారి ఒకపూట పడుతుంది. రేషన్‌కోసం ఒకరోజు పని మానుకోవాల్సి వస్తుంది. రేషన్ షాపులు ఎప్పుడు తీస్తారో తెలియని పరిస్థితులు గతంలో చూశాం. కూలీ చేసుకునేవారు సాయంత్రం సమయంలో షాపులకు వెళతారు, అయితే ఆ సమయంలో షాపులు మూసివేస్తే రేషన్ తీసుకునే అవకాశం కనిపించదు.

– మేర్నీడి సత్యవతి, వాకాడ, కరప మండలం

రేషన్ బియ్యాన్ని ఎత్తివేసినా ఆశ్చర్యపోనక్కరలేదు



చంద్రబాబు ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ డోర్ డెలివరీ విధానం రద్దు చేయడం అన్యాయం. దూరంగా ఉన్న రేషన్ డిపోలకు వెళ్లి క్యూలో నిలబడి రేషన్ తెచ్చుకోవాలి. దినసరి కూలీ చేసుకునే వారికి కష్టకాలమే. గతంలో చంద్రబాబు ప్రభుత్వం కిలో 2 బియ్యం ఎత్తివేస్తే, 2004లో వైఎస్సార్ అధికారంలోకి వచ్చి పునరుద్ధరించారు. భవిష్యత్‌లో రేషన్ బియ్యాన్ని ఎత్తివేసినా ఆశ్చర్యపోనక్కరలేదు.

– రావూరి వెంకటేశ్వరరావు, రమణయ్యపేట, కాకినాడ రూరల్

పడిగాపులు తప్పవు



ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో ప్రజలు రేషన్ షాపుల వద్ద పడిగాపులు పడాల్సి వుంది. రేషన్ షాపులో తూకాలలో మోసం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎండీయూ వాహనం వద్ద ఎదురుగానే ఎలక్ట్రానిక్ కాటాతో తూకం వేయడంతో తేడా వచ్చేది కాదు. వినియోగదారులు రేషన్ షాపునకు వెళ్లిన సమయంలో డీలర్ ఉంటారో లేదో తెలియని పరిస్థితి

– రేలంగి వెంకటలక్ష్మి, వీకే రాయపురం, సామర్లకోట మండలం

బలహీనవర్గాలను రోడ్డున పడేస్తున్నారు



ఎండీయూ వాహనాల రద్దుతో 95 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ బడుగు బలహీన వర్గాలకు చెందిన ఆపరేటర్లను రోడ్డున పడేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు రాజకీయాలలో భాగంగా తెల్ల రేషన్ కార్డుదారులకు ఇచ్చే బియ్యం, కంది పప్పు ఇంటింటికీ చేరవేసే ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం దుర్మార్గం. రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేని పక్షంలో ఎండియూ ఆపరేటర్లు చేసే ఆందోళనలకు మా పార్టీ మద్దతుగా నిలుస్తుంది.

– అల్లి రాజబాబు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

ఆ ఇద్దరి వల్లే రాష్ట్రం దివాళా

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి చంద్రబాబు, యనమలే కారణం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

తుని: రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీయడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, యనమల రామకృష్ణుడే కారణమని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. బుధవారం తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాజా మీడియా సమావేశంలో మాట్లాడారు. మంగళవారం తునిలో జరిగిన మినీ మహానాడులో యనమల రామకృష్ణుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి చేసిన ఏకవచన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం మద్యం పాలసీలో జగన్‌మోహన్‌రెడ్డికి రూ.3,200 కోట్లు వెళ్లాయని చెప్పడం, ఎల్లో మీడియాలో విస్తృత ప్రచారం చేయడం వెనుక టీడీపీ ఉందన్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి లిక్కర్‌ను ఎంకరేజ్ చేయనని చెప్పారని, లిక్కర్ ముట్టుకుంటేనే షాక్ కొట్టేలా ధరలు పెంచారన్నారు. మద్యం అమ్మకాలు తగ్గి రాష్ట్రానికి ఆదాయం పెరిగిందని, ఇటువంటి సమయంలో స్కామ్ ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో రెండుసార్లు చంద్రబాబు ముఖ్యమంత్రిగా, యనమల రామకృష్ణుడు ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలోనే రాష్ట్రాన్ని దివాళా స్థాయికి తీసుకువచ్చారని, 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రూ.100 కోట్లతో అప్పగించినట్టు చెప్పారని గుర్తు చేశారు. అప్పుల గురించి గాలి పోగు చేసి మాట్లాడుతున్న టీడీపీ నాయకులు ఏడాది పాలనలో రూ.3లక్షల కోట్లు అప్పు చేసి ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. చంద్రబాబునాయుడు 15 ఏళ్ల పాలనలో రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని విమర్శించారు. చంద్రబాబు చేసిన అప్పు ఎంత? రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎంత అప్పు ఉందని లెక్కలు చూసి మాట్లాడాలని రాజా సూచించారు. రాష్ట్రంలో వేధింపుల రాజకీయం, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఇందుకు వైఎస్సార్ సీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలపైన వేల సంఖ్యలో పోలీసులతో కేసులు పెట్టించారన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి నాయకులను, కార్యకర్తలను దూరం చేసేందుకు టీడీపీ యత్నిస్తోందని, దీనికి భయపడేదిలేదని అన్నారు. మీరు ఏది చేస్తున్నారో భవిష్యత్‌లో అదే జరుగుతుందన్నారు. చంద్రబాబు నిరపరాధి అని కోర్టు బెయిల్ ఇవ్వలేదని, అనారోగ్యం కారణంగానే బెయిల్ వచ్చిందన్న విషయాన్ని మరచిపోవద్దన్నారు. కేసుల పేరుతో కాలయాపన చేయకుండా పాలన గాడిలో పెట్టేందుకు పని చేయాలని సూచించారు.

యనమల సొంత ఊరు ఏవీ నగరంలో విద్యార్థులకు చదువుకోవడానికి ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయలేదని, రాష్ట్ర కేబినెట్‌లో కీలక మంత్రి పదవులు చేసిన యనమల ఎందుకు విద్యను ప్రోత్సహించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాడు-నేడులో అన్ని వసతులతో కూడిన స్కూల్‌ను నిర్మించామని, టీడీపీ ప్రభుత్వం వచ్చి 11 నెలలు అవుతున్నా ప్రారంభం చేయలేదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ టీడీపీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు తీర ప్రాంత ప్రజలకు పారిశ్రామిక సంస్థల నుంచి రూ.15 వేలు ఇప్పిస్తామని చెప్పి రేషన్‌కార్డులను తీసుకుని మోసం చేశారన్నారు. విజయవాడలో బుడమేరు వాగు పొంగిన ఘటనలో రూ.300 కోట్లు ఖర్చు చేసి వరద బాధితులకు పులిహోర పంపిణీ చేశామని చంద్రబాబు చెప్పుకున్నారని, తునిలో ఇదే రీతిలో 11 నెలల్లో రూ.170 కోట్లు అభివృద్ధి చేశామంటూ చెప్పడం చూస్తే దొందూ దొందేనన్న చందంగా ఉందన్నారు.

సత్యదేవుని హుండీ ఆదాయం రూ.1.55 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల సిబ్బంది

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి హుండీల ద్వారా 26 రోజులకు గాను రూ.1,55,04,639 ఆదాయం వచ్చింది. హుండీల ఆదాయం బుధవారం లెక్కించారు. ఈ కానుకల్లో నగదు రూ.1,46,96,779, చిల్లర నాణేలు రూ.8,07,860 వచ్చాయని చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు తెలిపారు. బంగారం 48 గ్రాములు, వెండి 730 గ్రాములు వచ్చినట్లు చెప్పారు. రోజుకి సరాసరి రూ. 5,96,332 హుండీ ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. అమెరికా డాలర్లు 184, కెనడా డాలర్లు 15, సింగపూర్ డాలర్లు రెండు, ఇంగ్లాండ్ పౌండ్లు ఐదు, స్కాట్‌లాండ్ పౌండ్లు పది, కువైట్ దీనార్లు 20, యూఏఈ దీరామ్స్ 25, ఖతార్ రియాల్స్ పది, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బహరెన్ దీనార్ ఒకటి లభించాయి. వేసవి సెలవులు, వివాహాలు, ఈ నెల ఏడో తేదీ నుంచి 13 వ తేదీ వరకు సత్యదేవుని కల్యాణ మహోత్సవాలు కారణంగా వేలాదిగా భక్తులు తరలి వచ్చారు. వీరంతా కానుకలు వేయడంతో భారీగా హుండీ ఆదాయం సమకూరింది. దేవస్థానం డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ రామ్మోహన్‌రావు లెక్కింపులో పాల్గొన్నారు.

కమ్యూనిటీ హెల్త్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): నిబంధనల ప్రకారం ఆరేళ్లు పూర్తి చేసుకున్న కమ్యూనిటీ హెల్త్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం 24 రోజులుగా రాజమహేంద్రవరం కలెక్టర్ వద్ద ఆందోళన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు బుధవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం తమను పట్టించుకోకపోవడంతో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు స్పష్టం చేయడంతో పార్టీ తరఫున అండగా ఉంటామని భరత్ హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ఎంపీల మద్దతుపై కేంద్ర ప్రభుత్వం ఆధారపడి ఉన్నప్పటికీ కేంద్రాన్ని డిమాండ్ చేయాల్సిన తెలుగుదేశం ఎందుకు లొంగిపోయిందో అర్థం కావడం లేదన్నారు. కరోనా నేపథ్యంలో ఎదుర్కొన్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేయాలని గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని భరత్ చెప్పారు. ఇందులో భాగంగా రాజమహేంద్రవరం మెడికల్ కాలేజీ మొదటి ఫేజ్‌లోనే తీసుకొచ్చామని, రెండవ ఏడాదిలోకి కాలేజీ అడుగుపెట్టిందని అన్నారు. తమ ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తీసుకొచ్చిందన్నారు. ఎన్నికల ముందు సంపద సృష్టిస్తామని చెప్పారని, ఆ హామీ ఏమైందన్నారు.

బదిలీలకు గ్రీన్ సిగ్నల్

- విడుదలైన జీవో
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
- కొన్ని అంశాలపై స్పష్టత లేదంటున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు



బదిలీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

రాయవరం: ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. రెండేళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్న బదిలీలను పాఠశాలల పునఃప్రారంభంలోపు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు బదిలీల జీవో 22ను ఈ నెల 20వ తేదీ అర్ధరాత్రి విడుదల చేసింది. దీంతో బుధవారం నుంచి బదిలీ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 హెచ్‌ఎంలకు బదిలీలు జరగనున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రాతిపదికన వీటిని నిర్వహిస్తారు. 2017 ఆగస్టు 31కి ముందు ఆ పాఠశాలలో విధుల్లో చేరిన స్కూల్ అసిస్టెంట్/ఎస్‌జీటీ తత్సమాన క్యాడర్, 2020 ఆగస్టు 31 ముందు విధుల్లో చేరిన గ్రేడ్-2 హెచ్‌ఎంలు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే 2027 మే నెలాఖరు లోపు ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని క్యాడర్లకు చెందిన సుమారు 18 వేల మంది వరకు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

ముఖ్యమైన తేదీలు

- బదిలీల ప్రక్రియకు సంబంధించి బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు ఈ నెల 21, 22 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలి. 28న ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంది.
- స్కూల్ అసిస్టెంట్లు ఈనెల 21 నుంచి 24 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జూన్‌1, 2 తేదీల్లో ఆప్షన్లు పెట్టుకోవాలి.
- ఎస్‌జీటీలు ఈ నెల 21 నుంచి 27 వరకూ దరఖాస్తులు చేసుకోవాలి. వీరికి జూన్ ఏడు నుంచి 10వ తేదీ వరకూ ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది.

హామీలకు కట్టుబడాలి



ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులతో రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలి. బదిలీ జీవోలో ప్రధానంగా మూడు అంశాల్లో స్పష్టత కొరవడింది. ఎస్‌జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్, ఖాళీలు బ్లాక్ చేయకుండా ఉండడం, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల స్టడీ లీవ్ ఖాళీల విషయంలో హామీలను అమలు చేయాలి. – పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

స్పష్టత లేదు



ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులతో జరిపిన చర్చల ప్రకారం మరికొన్ని విషయాల్లో అధికారులు స్పష్టంగా జీవోలు విడుదల చేయాలి. ఇంగ్లిషు మీడియంతో సమానంగా తెలుగు మీడియం నిర్వహించాలన్న అంశం, మిగులు స్కూల్ అసిస్టెంట్లను ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలన్న అంశాలపై స్పష్టత లేదు. – నరాల కృష్ణకుమార్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ

నిబంధనల ప్రకారమే..



బదిలీ షెడ్యూల్ విడుదలైంది. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్నాం. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బదిలీలు నిర్వహిస్తాం. విద్యాశాఖ నుంచి వచ్చిన మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు కిందస్థాయికి చేరవేసి, ఎటువంటి గందరగోళానికి తావులేకుండా నిర్వహిస్తాం.

– పి.రమేష్, డీఈవో, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

సముద్రంలో ముమ్మరంగా గాలింపు

కొత్తపల్లి: సముద్రంలో వేటకు వెళ్లిన బోటు ప్రమాదవశాత్తూ బోల్తా పడడంతో గల్లంతైన మేరుగు శ్యామ్ కోసం బుధవారం కూడా ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగించారు. మత్స్యకారులు, అధికారులు నాలుగు బోట్లపై అతడి కోసం వెతుకుతున్నారు. అయితే తుపాను కారణంగా సముద్రంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో గాలింపు చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

సారా నిందితుడిపై పీడీ యాక్ట్

ప్రత్తిపాడు: పెద్దిపాలెం గ్రామంలో సారా నిందితుడిపై పీడీ యాక్టు అమలు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ బుధవారం తెలిపారు. పలు మార్లు సారా కేసులో నిందితుడిగా ఉన్న నడిగట్ల నూకరాజును అరెస్టు చేసి, పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు. నిందితుడిని స్థానిక కోర్టులో హాజరుపరచి, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించినట్టు చెప్పారు.

నకిలీ నోట్లు చలామణి చేస్తున్న ఇద్దరి అరెస్టు



అంగర పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ దొరరాజు

కపిలేశ్వరపురం: నకిలీ నోట్లను చలామణి చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను బుధవారం అంగర పోలీస్ స్టేషన్‌లో మండపేట రూరల్ సీఐ దొరరాజు వెల్లడించారు. ఆ ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం అంగర ఆర్‌అండ్‌బీ రహదారిలోని రైస్‌మిల్లు సమీపంలోని కిళ్లీకొట్టు వద్దకు మంగళవారం రాజమహేంద్రవరానికి చెందిన మన్యం వీర వెంకట సత్య సీతారామారావు వచ్చాడు. తన దగ్గర ఉన్న రూ.500 నోటు ఇచ్చి సిగరెట్ పెట్టె కొన్నాడు. ఆ నోటు నకిలీదని కిళ్లీకొట్టు యజమాని సత్యనారాయణ గుర్తించాడు. స్థానికుల సహాయంతో సీతారామారావును పట్టుకుని అంగర పోలీసులకు అప్పగించాడు. ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలపై నిందితుడిని సీఐ దొరరాజు, ఎస్సై డి.రవికుమార్ విచారించారు. అతడి సమాచారం మేరకు పోలీసులు విజయవాడకు చెందిన వారా నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. నవీన్ నుంచి 44 నకిలీ రూ.500 నోట్లు, లాప్‌టాప్, పెన్ డ్రైవ్, ముద్రణ సామగ్రిని స్వాధీనం చేసుకొన్నారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు సీఐ దొరరాజు తెలిపారు.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

యానాం: పట్టణ పరిధిలోని న్యూరాజీవ్ నగర్‌కు చెందిన దంగుడుబియ్యం సత్యవతి (75) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కుమార్తె ఫంక్షన్‌కు వెళ్లిన సమయంలో బలవన్మరణానికి పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం యానాం జీజీహెచ్‌కు తరలించామని, ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై పంపన మూర్తి తెలిపారు. ఏడాదిగా సత్యవతి మానసికస్థితి బాగోలేదని, మందులు వాడుతోందని స్థానికులు తెలిపారు.

లాభాల దుక్కు

- దుక్కుతో పొలాలకు భూసారం
- తెగుళ్ల నుంచి పంటలకు రక్షణ
- వ్యవసాయశాఖ సూచనలు తప్పనిసరి



అంగరలో పొలాన్ని దుక్కు చేస్తున్న రైతు



పినపళ్లలో దుక్కు దున్నిన భూమి

అలమూరు: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే రైతులు కొన్ని పద్ధతులను అవలంబించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచించిన ఆధునిక విధానాలతో పాటు సంప్రదాయం పద్ధతులు పాటిస్తే తెగుళ్లను నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 4.6 లక్షల ఎకరాల్లో వరిసాగు జరగనుంది. ప్రస్తుతం వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు, సాగు నీటి ఎద్దడితో మూడో పంటకు అవకాశం లేకుండా పోతోంది. దీని వల్ల భూమికి సారాన్ని అందించే పచ్చిరొట్టను సాగు చేసేందుకు వీలు కావడం లేదు. ఇలాంటి తరుణంలో రబీ, ఖరీఫ్‌కు మధ్య వేసవిలో చేపట్టే దుక్కుల వల్ల భూసారం పెరుగుతుంది. పూర్వ కాలం యంత్ర పరికరాలు లేనప్పుడు కేవలం ఎద్దులతో పరిమితంగా దుక్కులు చేసే వారు. ప్రస్తుతం ట్రాక్టర్ల సాయంతో చాలా తొందరగా ఈ పని జరుగుతోంది.

నిబంధనలు పాటించాలి

ఖరీఫ్ సాగు చేయబోయే పంటకు తెగుళ్ల బెడదను నివారించి అధిక దిగుబడులు సాధించాలంటే వ్యవసాయశాఖ సూచనలతో పాటు నిబంధనలను కచ్చితంగా పాటించాలి. సాధారణంగా కల్టివేటర్ (ట్రాక్టర్‌కు వాడే మామూలు నాగలి) బదులుగా లోతు దుక్కి దున్నడానికి రెక్క నాగలి, బల్లెపు నాగలి, గునపపు నాగలి వాడితే నేలలో 30 నుంచి 75 సెంటీమీటర్ల లోతుకు దిగి ప్రయోజనాలు ఎక్కువగా ఉంటాయి. వాలుకు అడ్డంగా దుక్కి చేయడం వల్ల భూమి కోతకు గురి కాకుండా తేమ పెరుగుతుంది. ప్రస్తుతం పొలాలు ఖాళీగా ఉండటం వల్ల కలుపు మొక్కలు విపరీతంగా పెరిగి పొలంలో నాటుకుపోతాయి. వాటి వల్ల రానున్న పంటలకు కలుపు బెడద ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ప్రతి పొలంలోనూ వేసవిలో దుక్కులు దున్నాలి. మామూలు నాగలితో కంటే ప్రత్యేకంగా ఉన్న నాగళ్లను ఉపయోగించడం ద్వారా పొలంలో ఒక అడుగుకు పైగా లోతు దుక్కి చేయడానికి వీలు కలుగుతుంది.

యాజమాన్య పద్ధతులు

పొలాలను అలాగే వదిలేయకుండా కొన్ని యాజమాన్య పద్ధతులు చేపట్టాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడం, భూమిని శుభ్రం చేసుకోవడం, లోతు దుక్కులు వంటి ముందస్తు చర్యలు చేపట్టడం ద్వారా రానున్న ఖరీఫ్‌లో రైతులు మంచి ఫలితాలు అందుకునే వీలుంటుంది. ఎండాకాలంలో భూములు ఖాళీగా ఉన్న సమయంలో లోతు దుక్కి చేయడం మంచి ఫలితాలను ఇస్తుంది. మేలో తొలకరి పలకరించడంతో అధిక వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ముందుగానే ప్రారంభం కాబోతోంది. ఈ దుక్కులు ముఖ్యంగా మెట్ట, చాగల్నాడు ప్రాంతాల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం మైదాన ప్రాంతాల్లోను కూడా వేసవి దుక్కులు విరివిగా చేపడుతున్నారు.

భూసారం పెరుగుతుంది



వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా పంట పొలాల్లో దుక్కు దున్నడం ద్వారా భూసారం పెరుగుతుంది. తెగుళ్లను నివారించుకోవడం ద్వారా పెట్టుబడిని ఆదా చేసుకోవచ్చు. అధిక దిగుబడులకు ఆస్కారం ఏర్పడుతుంది. రైతులందరూ క్రమం తప్పకుండా దుక్కుకు ప్రాధాన్యమివ్వాలి.

– కె.నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, ఆలమూరు డివిజన్

ప్రయోజనాలు

- పొలాల్లో వేసవి లోతు దుక్కులు చేపట్టడం వల్ల భూమి సారవంతమవుతుంది.
- భూమి కింద పొరలోని మట్టి పైకి, పై పొరల్లో ఉన్న మట్టి కిందకు రావడంతో ఎండ వేడికి అందులోని క్రిమికీటకాలు నశిస్తాయి.
- నేల గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వర్షపు నీరు వృథా కాకుండా సద్వినియోగం చేసుకునే వీలు కలుగుతుంది.
- పొలాల్లో లోతుగా దున్నడం వల్ల భూమిలో నీరు ఇంకి పోయి తేమ శాతం పెరుగుతుంది. సేంద్రియ పదార్థాలు త్వరితగతిన కుళ్లిపోయి పోషకాలుగా మారతాయి.
- భూమిని అడుగు లోతు వరకూ దున్నితే విత్తనం వేగంగా మొలకెత్తి, వేళ్లు సులభంగా భూమిలో దిగి మొక్కకు సారం పెరుగుతుంది.
- పంట చేలల్లో పెరిగే వరినాట్లు భూమిలో ఉండే పోషకాలను సంగ్రహించి మొక్క పెరుగుదలకు తోడ్పాటు అందిస్తుంది.
- భూమిలో చీడపీడలను నిర్మూలించడంతో పాటు కోశస్థ దశలో ఉన్న కీటక నాశినులు, శిలీంద్రాలు, పురుగులు, బ్యాక్టీరియా పాటు కలుపు మొక్కలు ఎండ వేడికి నశిస్తాయి.
- దుక్కులు చేసేటప్పుడు భూమి నుంచి పైకి వచ్చే పురుగులను పక్షులు తినడం ద్వారా తెగుళ్ల బెడద తప్పుతుంది.
- పొలాల్లో మట్టి గడ్డలు తొలగిపోయి సారవంతమైన నేల ఏర్పడి నాణ్యమైన పంట పండించేందుకు దోహదపడుతుంది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

140 గ్రాముల బంగారు ఆభరణాల చోరీ



అయితపూడిలో స్థానికులతో మాట్లాడుతున్న ఏఎస్పీ దేవరాజ్ పాటిల్

కాజులూరు: అయితపూడిలోని మాజీ సర్పంచ్, పారిశ్రామిక వేత్త కొల్లు వెంకటేశ్వరరావు ఇంట్లో దొంగలు పడి, సుమారు 140 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. గొల్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు గత బుధవారం తిరుపతి, ఇతర తీర్థయాత్రలకు వెళ్లి మంగళవారం రాత్రి 10 గంటల సమయానికి తిరిగి వచ్చారు. లోపలకు వెళ్లి చూడగా ఇంటిలోని ఇనుప బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. దానిలో 140 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు బుధవారం గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్ కుమార్ కేసు నమోదు చేసి, డాగ్ స్క్వాడ్, క్లూస్క్వాడ్ సాయంతో దర్యాప్తు చేపట్టారు. కాకినాడ ఏఎస్పీ దేవరాజ్ పాటిల్, రూరల్ సీఐ చైతన్య కృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు.

విషాద యాత్ర

- కారును ఢీకొన్న లారీ
- తల్లీ కుమారుడు మృతి, మరో నలుగురికి తీవ్ర గాయాలు
- కాళేశ్వరం పుష్కరాలకు వెళ్లి వస్తుండగా ఘటన



కొత్తగూడెం వద్ద నుజ్జునుజ్జయిన కారు



మామిడిశెట్టి కనకదుర్గ (ఫైల్)



మామిడిశెట్టి వెంకటరత్నం (ఫైల్)

అంబాజీపేట: పుష్కరాలకు వెళ్లి ఉత్సాహంగా ఇంటికి తిరిగి వస్తున్న ఆ కుటుంబాన్ని లారీ రూపంలో మృత్యువు కబళించింది. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ప్రమాదంలో తల్లి, కుమారుడు చనిపోగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం .. అంబాజీపేట మండలం చిరతపూడికి చెందిన మామిడిశెట్టి వెంకటపతి (ముసలయ్య), భార్య కనకదుర్గ (54), వీరి కుమారుడు వెంకటరత్నం (32), కోడలు జ్యోతి స్వరూప, మనుమలు 12 ఏళ్ల దీక్షిత, 2 ఏళ్ల చేతన్ ఈ నెల 19వ తేదీ రాత్రి కాళేశ్వరం పుష్కరాలకు కారులో వెళ్లారు. అక్కడి నుంచి ఈ నెల 20న భద్రాచలంలో దైవ దర్శనం చేసుకున్నారు. అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా కొత్తగూడెం వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును బొగ్గు లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కనకదుర్గ, వెంకటరత్నం అక్కడికక్కడే మృతి చెందారు. వెంకటపతి, జ్యోతి స్వరూప, దీక్షిత, చేతన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చి వైద్య సేవలు అందిస్తున్నారు. కనకదుర్గ, వెంకటరత్నం మృత దేహాలను చిరతపూడి తీసుకువచ్చారు. లారీ డ్రైవర్ మద్యం మత్తు, అతివేగం, నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాలు కీలకం



మలికిపురంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్, చిత్రంలో ఎస్పీ కృష్ణారావు

మలికిపురం: నేరాల దర్యాప్తు, పరిశోధనలలో సీసీ కెమెరాలు కీలకంగా మారాయని, అందుకే ప్రతి కూడళ్లలో వాటిని ఏర్పాటు చేశామని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్ అన్నారు. ఆయన బుధవారం మలికిపురం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల జరిగిన అనేక నేరాలు, చోరీ కేసులలో నేరస్తుల గుర్తింపునకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడ్డాయన్నారు. అన్ని ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, వర్తక సంఘాలు కూడా సహకరించాయన్నారు. జిల్లాలో గంజాయి నేరాలు తగ్గాయని, ఈ కేసులలో పాత నేరస్తులపై నిఘా ఉంచి కట్టడి చేస్తున్నామన్నారు. గ్రామాల్లో నాయకుల విగ్రహాల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజాసంఘాలకు సూచించామన్నారు. గల్ఫ్ ఉద్యోగాల పేరుతో కోనసీమలో మోసాలు జరుగుతున్నట్లు గుర్తించామన్నారు. లైసెన్స్ కలిగిన ఏజెంట్ల ద్వారానే విదేశాలకు వెళ్లాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఎస్పీ బి.కృష్ణారావు, డీఎస్పీ సుంకర మురళీ మోహన్, సీఐ నగేష్ కుమార్, ఎస్సైలు పీవీఎస్ఎస్ఎన్ సురేష్, రాజేష్ కుమార్, కె.దుర్గా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సొమ్ము కొట్టు.. సర్టిఫికెట్ పట్టు..

- జీజీహెచ్‌లో నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల దందా
- వైద్యుల సంతకాల ఫోర్జరీ
- ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగుల సస్పెన్షన్

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల దందా వెలుగులోకి వచ్చింది. ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులే దీనికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడకు చెందిన బుద్దాల వెంకన్న ఏపీఎస్ఆర్టీసీ కాకినాడ డిపోలో కండక్టర్‌గా పనిచేసేవాడు. ఓ వివాదానికి సంబంధించి కోర్టులో వెంకన్నపై కేసు కొనసాగుతోంది. హాజరు కావాలని కోర్టు ఆదేశించినా వెళ్లకుండా తప్పించుకునే క్రమంలో నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించేందుకు పన్నాగం పన్నాడు. ఆ క్రమంలో ఆర్థోపెడిక్‌లోని కట్టుకట్టే విభాగంలో అనధికారికంగా కొనసాగుతున్న సత్యగురును సంప్రదించాడు. అతడి సూచనల మేరకు గత ఏడాది అక్టోబర్ 14వ తేదీ మధ్యాహ్నం 12.42 గంటలకు నడుము నొప్పి అని చెప్పి ఓపీ రశీదు తీసుకున్నాడు. సీఎంవో 3 యూనిట్‌లో చూపించుకొని, సత్యగురు సూచన మేరకు అప్పటి డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత కార్యాలయానికి వెళ్లాడు. తనకు ఉద్యోగంలో సెలవులు పొందడంతో పాటు, కోర్టులో సమర్పించడానికి తాను కోరిన పాత తేదీలలో మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వాలని కోరాడు. అలా మంజూరు చేయడం కుదరదని అప్పటి డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ అనిత తేల్చి చెప్పారు.

కొన్ని గంటల్లోనే రెడీ

ఎలాగైనా సర్టిఫికెట్ పొందాలన్న ఉద్దేశంతో సత్యగురును మళ్లీ కండక్టర్ వెంకన్న ఆశ్రయించాడు. దీంతో జీజీహెచ్‌లోని జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.ఉమామహేశ్వరరావును వెంకన్నకు సత్యగురు పరిచయం చేశాడు. వారికి మరో జూనియర్ అసిస్టెంట్ బంగారు సత్యనారాయణ వీరికి తోడయ్యాడు. బేరసారాలు పూర్తయిన తర్వాత వెంకన్నకు సర్టిఫికెట్ ఇచ్చేందుకు జూనియర్ అసిస్టెంట్లు ఒప్పుకున్నారు. కొన్ని గంటల్లోనే డీసీఎస్ఆర్ఎంవో సంతకం, ఆసుపత్రి స్టాంపుతో మెడికల్ సర్టిఫికెట్ రెడీ చేసి వెంకన్నకు అందించారు.

నకిలీదని నిర్ధారణ

కండక్టర్ వెంకన్న ఆ సర్టిఫికెట్‌ను ఆర్టీసీ డిపో కార్యాలయానికి పంపాడు. కోర్టుకు కూడా దానినే పంపి తప్పుదోవ పట్టించాలనుకున్నాడు. అయితే డిపో మేనేజర్‌కు అనుమానం వచ్చి, కాకినాడ జీజీహెచ్‌కు వాస్తవికత నిర్ధారణ కోసం ఆ మెడికల్ సర్టిఫికెట్ పంపారు. దాన్ని ఆసుపత్రి అధికారులు పరిశీలించి నకిలీదని తేల్చారు. దీంతో వెంకన్నను ఆర్టీసీ అధికారులు తొలుత సస్పెండ్ చేసి, ఆపై చేసిన మోసం రుజువు కావడంతో పూర్తిగా ఉద్యోగం నుంచి తొలగించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కండక్టర్ వెంకన్న ఈ ఏడాది మార్చి 21న స్పందనలో కలెక్టర్ షన్‌మోహన్‌ను కలిసి.. సర్టిఫికెట్ నిజ నిర్ధారణ చేసిన ఆసుపత్రి అధికారులపై ఫిర్యాదు చేశాడు. దీనిపై కలెక్టర్ స్పందించి విచారణ చేయగా, కండక్టర్ వెంకన్న సమర్పించిన మెడికల్ సర్టిఫికెట్ నకిలీదని మరోమారు నిర్ధారణ అయ్యింది. జూనియర్ అసిస్టెంట్లు ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ డబ్బులు తీసుకుని, నకిలీ సర్టిఫికెట్ ఇచ్చారని గుర్తించారు. వారిద్దరూ పలువురు వైద్యుల సంతకాలు ఫోర్జరీ చేసినట్టు వెల్లడైంది. గ్రీన్ ఇంక్ పెన్‌తో వైద్యులు, వైద్యాధికారుల సంతకాలు చేయడమే కాకుండా, కొన్నిసార్లు అధికారులు లేనప్పుడు వారి చాంబర్లలోకి చొరబడి స్టాంపులు వేసుకునేవారని స్పష్టమైంది. దీంతో జూనియర్ అసిస్టెంట్లు ఇద్దరినీ మంగళవారం రాత్రి సస్పెండ్ చేస్తూ ఆసుపత్రి ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సత్యగురుపై పోలీసులు ఆసుపత్రి అధికారులు ఫిర్యాదు చేయనున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



అవిడి కాలువ కల్వర్టు వద్ద సుధాకర్ మృతదేహం

కొత్తపేట: అవిడి పెదపేట గ్రామానికి చెందిన నామాడి సుధాకర్ అలియాస్ బుజ్జి (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అవిడి రేవు సమీపంలో పంట కాలువ కల్వర్టు గోడపై అతడు మృతి చెంది ఉండటాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. ఎస్సై జి.సురేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సుధాకర్‌కు భార్య కల్యాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండగా, పెద్ద కుమార్తె ఎంసెట్ పరీక్ష రాసింది. చిన్న కుమార్తె పదో తరగతి పరీక్షలు రాసింది. ప్రస్తుతం ఖాళీగా ఉంటున్న సుధాకర్ మంగళవారం ఉదయం నుంచి మద్యం తాగుతూనే ఉన్నాడు. రాత్రి 9 గంటల సమయంలో పంట కాలువ కల్వర్టు వద్ద అతడు మద్యం మత్తులో ఉండగా స్థానికులు చూశారు. ఉదయానికి రక్తపు వాంతులు చేసుకుని చనిపోయి ఉండగా గుర్తించి, అతడి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సురేంద్ర సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్నయ్య నామాడి రవి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి



యర్రా మాణిక్యం (ఫైల్)

రాజానగరం: జాతీయ రహదారిపై జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రి వద్ద బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. కలవచర్లకు చెందిన యర్రా మాణిక్యం (54) కంటి చూపు సరిగా కనిపించక ఇబ్బంది పడుతోంది. కంటి పరీక్ష చేయించుకుందామని జీఎస్ఎల్ ఆస్పత్రికి వచ్చిన ఆమె తిరిగి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైంది. టు వే గా ఉన్న రహదారిపై డివైడర్ దాటి అవతలి వైపుకు వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్సై నాగార్జున తెలిపారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ముగ్గురు పిల్లలకు వివాహాలు చేశారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మోటార్ బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి



నాగూర్ సాహెబ్ (ఫైల్)

గండేపల్లి: వర్షం కారణంగా మోటారు బైక్ అదుపు తప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపిన వివరాల ప్రకారం .. గండేపల్లికి చెందిన షేక్ నాగూర్ సాహెబ్ (57) రాజానగరంలోని గైట్ కళాశాలలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం మోటార్ సైకిల్‌పై డ్యూటీకి బయలుదేరారు. వర్షం పడుతున్న సమయంలో మురారి శివారు మాతారాణి దాబా ఎదురుగా మోటార్ సైకిల్ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజానగరం జీఎస్ఎల్‌కు, అక్కడి వైద్యుల సూచనల మేరకు కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. నాగూర్ సాహెబ్‌కు భార్య నూర్జహాన్, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కంప్యూటర్లు చోరీ చేసిన ఇద్దరి అరెస్టు




విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ సూర్య అప్పారావు, ఎస్సై శ్రీహరిబాబు

శంఖవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్లను చోరీ చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్టు ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపారు. ఈ మేరకు బుధవారం అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 18న రూ.15 వేలు విలువైన కంప్యూటర్లు, సీపీయూలు, ప్రింటర్లు చోరీకి గురైనట్లు ప్రధానోపాధ్యాయులు టి.భాస్కరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో నెల్లిపూడి – బెండపూడి రోడ్డు మధ్యలో శంఖవరానికి చెందిన గామాల అశోక్, బోడపాటి చిన్నోడు ఆటోలో కంప్యూటర్లను వేరే చోటుకు తరలిస్తుండగా అరెస్టు చేశారు.

విధుల నుంచి ఎంపీడీవో తొలగింపు

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీడీవో డి.శ్రీనివాసరావును విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎంఎఫ్ఎస్ బిల్లుల వ్యవహారంలో జరిగిన అవతవకలపై కలెక్టర్ ప్రశాంతి విచారణ చేయగా అది నిజమని తేలింది. దీంతో కలెక్టర్ పంచాయతీ రాజ్ కమిషనర్‌కు సిఫారసు చేయగా ఎంపీడీవోను సీపీఆర్‌కు సరెండర్ కావాలని ఉత్తర్వులిచ్చింది. డిప్యూటీ ఎంపీడీవో కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను పూర్తి అడిషనల్ చార్జ్ ఎంపీడీవోగా నియమించారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి



మృతి చెందిన గేదె

తాళ్లరేవు: చొల్లంగి వద్ద రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభానికి ఉన్న తీగ తగిలి పలివెల అరుణ కుమారికి చెందిన పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. భూమి లోపల వేయాల్సిన విద్యుత్ వైరును సంబంధిత కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా పైన వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. దీనిపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని ఎన్‌హెచ్ అధికారులకు ఫిర్యాదు చేశారు.